క్లుప్తంగా

అధికారుల విచారణ

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థినిపై చేయిచేసుకున్న సంఘటన, పాఠశాల హెచ్ఎంపై ఉపాధ్యాయులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంపై, పదో తరగతి పరీక్ష ఫీజు అధిక వసూలుపై శుక్రవారం 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనానికి జిల్లా గిరిజన శాఖ అధికారి ఎర్రయ్య స్పందించాడు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని ముత్యాలమ్మగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో విచారణను ఏసీఎం, ఏటీడీఓ విచారణ చేపట్టారు. ఈసందర్భంగా అధికారి ఎర్రయ్య మాట్లాడుతూ.. గిరిజన ఆశ్రమ పాఠశాల హెచ్ఎంపై పూర్తి స్థాయిలో నివేదికను హెచ్ఎం విద్యార్థులు, ఉపాధ్యాయుల పట్ల ప్రవర్తించిన తీరుపై ప్రాజెక్టు అధికారికి అందించామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు హర్షణీయం

మహబూబాబాద్: ములుగులో ఏర్పాటు చేయనున్న సమ్మక్క–సారక్క ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటుకు లోక్ సభ ఆమోదం తెలపడం ఎంతో హర్షణీయమని ఎంపీ మాలోత్ కవిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గల్లీ నుంచి ఢిల్లీ దాకా బీఆర్ఎస్ పోరాటాలు చేయడంతోపాటు కేంద్ర ప్రభుత్వ పెద్దలకు మాజీ సీఎం కేసీఆర్ ఎన్నోమార్లు విన్నవించడంతో ఎట్టకేలకు మోక్షం కలిగిందన్నారు.

సిగ్నల్‌తండా రోడ్డు పరిశీలన

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని సిగ్నల్‌తండా రోడ్డును శుక్రవారం మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, కమిషనర్ మున్వర్ అలీ పరిశీలించారు. సిగ్నల్‌తండా రోడ్డు ఇబ్బందులపై 'సాక్షి' దినపత్రికలో 'రోడ్డు ఇలా.. నడిచేదెలా' పేరుతో కథనం ప్రచురితమవడంతో స్పందించిన చైర్మన్, కమిషనర్ తండా రోడ్డును పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జర్పుల వీరన్న, నాయకులు మాదా శ్రీనివాస్, సుమేర్‌చంద్‌జైన్, హరికృష్ణ, ఖాదర్ పాల్గొన్నారు.

మోకాళ్లపై నడిచి.. మొక్కు చెల్లింపు



పెద్దవంగర: పాలకుర్తి నియోజకవర్గంలో మామిడాల యశస్విని రెడ్డి ఎమ్మెల్యేగా విజయ సాధించడాన్ని హర్షిస్తూ పాలకుర్తి దేవస్థానంలో సోమేశ్వర స్వామి వద్దకు మోకాళ్లపై వెళ్లి ఆమె అభిమాని జాటోతు శ్రీనివాస్ శుక్రవారం మొక్కులు చెల్లించుకున్నాడు. యశస్విని ఝాన్సీరెడ్డి గెలిస్తే మోకాళ్లపై వచ్చి పూజలు చేస్తానని మొక్కుకున్నట్లు తెలిపాడు.

మంత్రికి శుభాకాంక్షలు



తొర్రూరు: రాష్ట్ర మంత్రిగా నియమితులైన దుద్దిళ్ల శ్రీధర్ బాబును శుక్రవారం హైదరాబాదులో బ్రాహ్మణ అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్ ఆధ్వర్యంలో సంఘ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నాయకులు సీతారామయ్య, నగేష్, మధుసూదన్ రావు, కల్లూరి ప్రభాకర్, భాను శర్మ పాల్గొన్నారు.

జాతీయ స్థాయికి విద్యార్థి ఎంపిక



నెల్లికుదురు: ఎన్టీపీసీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పేయింటింగ్ పోటీల్లో మండలంలోని మునిగలవీడు గ్రామ శివారు బీమ్లా తండాకు చెందిన ఆనంద్ ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కె.శశాంక చేతుల మీదుగా మొదటి బహుమతి గెలుపొందిన ఆనంద్‌కు రూ.50వేల నగదు అందించి శాలువాతో అభినందించారు. విద్యార్థుల విజయానికి బాటలు వేసిన డ్రాయింగ్ టీచర్ దోనెపల్లి రాజేష్, హెచ్ఎంతోపాటు ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. డిసెంబర్‌లో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఆనంద్ పాల్గొంటున్నట్లు తెలిపారు.

మార్చురీ గదికి మోక్షమెప్పుడో?

- పోస్టుమార్టం కోసం మహబూబాబాద్‌కు వెళ్లాల్సిందే



నిజాం కాలం నాటి మార్చురీ గది శిథిలమై బయట పడిన పునాదిరాళ్లు

గార్ల: గార్లలోని ప్రభుత్వ ఆస్పత్రిలో నిజాం కాలంలో నిర్మించిన మార్చురీ గది పూర్తిగా శిథిలమై కూలిపోయింది. మండలంలో రైలు, రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందిన వారికి పోస్టుమార్టం నిర్వహించేందుకు మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్తూ, మృతుల కుటుంబీకులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. గార్ల, బయ్యారం మండలాలకు కలిపి నిజాం కాలంలో గార్ల గ్రామ సమీపంలోని మర్రిగూడెం రోడ్డులో నిర్మించిన మార్చురీ భవనం పూర్తిగా ధ్వంసమైంది. నిర్మించిన నాటి నుంచి నేటి వరకు అధికారులు ఈ భవనం బాగోగులు ఎవరూ పట్టించుకోక పోవడంతో ప్రస్తుతం ఈ ప్రాంతంలో పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. పోస్టుమార్టం భవనం శిథిలమవడంతో గార్ల సీహెచ్‌సీ ఆస్పత్రిలోని డాక్టర్లు పోస్టుమార్టం గది లేక మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించడంలేదు. దీంతో నిరుపేదల్లో ఎవరైనా రైలు, రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందితే శవ పంచనామా కోసం మృతదేహాన్ని మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించేందుకు ఆర్థికస్థోమత లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. శవాన్ని పోస్టుమార్టం కోసం మహబూబాబాద్ తీసుకెళ్లేందుకు వాహనాలకు అద్దె చెల్లిస్తామన్న వాహనదారులు ముందుకు రావడం లేదు. 10 ఏళ్ల నుంచి పాలకులకు, అధికారులకు గార్లలో పోస్టుమార్టం భవనం నిర్మించాలని మండల ప్రజలు వేడుకున్నా ఫలితం లేదు. గార్ల ప్రభుత్వ ఆస్పత్రి సైతం శిథిలమవడంతో ఇటీవల రూ.5కోట్ల వ్యయంతో నూతనంగా సీహెచ్‌సీ ఆస్పత్రి భవనం నిర్మించారు. ఇప్పటికైనా జిల్లా వైద్యాధికారులు స్పందించి గార్ల సీహెచ్‌సీ ఆస్పత్రి వెనుకభాగంలో పోస్టుమార్టం గది నిర్మాణం చేపట్టి పోస్టుమార్టం నిర్వహించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు లేక అవస్థలు పడుతున్నాం..



సీసీ రోడ్డు నిర్మించాల్సిన కాలనీ దారి

డోర్నకల్: సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడం, రైల్వే శాఖ అధికారులు ఇళ్ల ముందు డ్రెయినేజీ నిర్మించడంతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సర్దార్జీ క్వార్టర్ల వాసులు, రైల్వే హాస్పటల్ సమీప వాసులు వాపోతున్నారు. సినిమా హాల్ రోడ్డు నుంచి సర్దార్జీ క్వార్టర్ల మీదుగా భగత్ సింగ్ విగ్రహం వరకు కల్లు కాంపౌండ్ సమీపం నుంచి భగత్‌సింగ్ విగ్రహం వరకు సిమెంట్ రోడ్లను నిర్మించాల్సి ఉండగా పలు కారణాలతో రోడ్ల నిర్మాణం జరగలేదు. ఇటీవల రైల్వేశాఖ స్థలంలో డ్రెయినేజీ నిర్మాణం చేపట్టి ఇళ్ల నుంచి వచ్చే నీటితోపాటు వరదనీరు వెళ్లకుండా కాల్వ నిర్మించారు. డ్రెయినేజీ కాల్వ నిర్మాణ పనులు జరుగుతుండటంతో వరద నీరు ఇళ్ల మధ్య నిల్వడంతోపాటు దారి సక్రమంగా లేక రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుండటంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపాలిటీ అధికారులు, పాలకవర్గం స్పందించి రెండు మార్గాలకు కలుపుతూ సిమెంటు రోడ్లు నిర్మించాలని, రోడ్డు ప్రక్కన ఉన్న భగత్‌సింగ్ విగ్రహ తరలింపు సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న షీ టీం ఎస్సై సునంద

మహబూబాబాద్ అర్బన్: సైబర్ నేరాలపై విద్యార్థినులు, మహిళలు అప్రమత్తంగా ఉండాలని షీ టీం ఎస్సై సునంద అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని ముత్యాలమ్మ గూడెం గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలల్లో శుక్రవారం ఎస్పీ ఆధ్వర్యంలో షీ టీం మహిళా పోలీసు విభాగంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సునంద మాట్లాడుతూ.. బాలికలకు, మహిళలకు ఆపద సమయంలో డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. బాలికలు అవసరమైన ఆత్మరక్షణ విద్యను నేర్చుకోవాలన్నారు. సోషల్ మీడియాలో ఫొటోలను, వ్యక్తిగత విషయాలను షేర్ చేయొద్దని, సైబర్ సెక్యూరిటీ సేవలు 1930కు ఫోన్ చేయాలన్నారు. షీ టీం వాట్సాప్ నంబర్ 87126 56935, 79011 42009 సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం జె.మొగిలయ్య, ఏఎస్సై ఆనందం, పీసీలు అరుణ, పార్వతి, రమేష్ పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ



ప్రింటర్ బహూకరిస్తున్న సాబాదు వెంకన్న, మంజుల

మహబూబాబాద్ రూరల్: మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు గణిత ఉపాధ్యాయుడు రామసహాయం శ్రీధర్ రెడ్డి చొరవతో పాఠశాల పూర్వ విద్యార్థి అమెరికాలో ఉద్యోగం చేస్తున్న సాబాదు రమణారెడ్డి రూ.25వేల విలువైన ప్రింటర్‌ను తన తల్లితండ్రులు సాబాదు వెంకన్న, మంజుల చేతుల మీదుగా శుక్రవారం అందజేశాడు. ఈసందర్భంగా హెచ్ఎం రమేష్ బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలలో చదివే పేద విద్యార్థుల కోసం సహకారం అందించడంలో దాతలు ముందుకు రావాలని కోరారు. రమణారెడ్డి తల్లిదండ్రులను సత్కరించాడు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ పోతుగంటి చిరంజీవి, ఉపాధ్యాయులు ఉప్పలయ్య, కాసం శ్రీనివాసరావు, తిరుపతి, షీబారాణి, సతీష్ కుమార్, ఝాన్సీ, వెంకటేశ్వర్లు, వనజ, శ్రీధర్, కవిత, జ్యోతి పాల్గొన్నారు.

ఎకరాకు రూ.50వేల పరిహారం ఇవ్వాలి



గార్ల: మాట్లాడుతున్న శ్రీనివాసరావు

గార్ల: మిచాంగ్ తుపానుతో దెబ్బతిన్న వరి, మిర్చి, పత్తి పంటల రైతులకు ఎకరాకు రూ.50వేలు నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలో పార్టీ నాయకుల బృందం దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. రైతులకు పంట చేతికొచ్చే తరుణంలో తుపాన్ వచ్చి రైతులకు తీరని అన్యాయం చేసిందన్నారు. వరిపంట నేలమట్టం కాగా, మిర్చితోటలు నేలకొరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు స్పందించి దెబ్బతిన్న పంట భూములు సర్వే చేపట్టి జిల్లా అధికారులకు నివేదికలు పంపించి, రైతులకు ప్రభుత్వం నుంచి పరిహారం చెల్లించేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో హరినాయక్, పెద్దవెంకటేశ్వర్లు, రాజారావు, ఇమ్మడి గోవింద్, సత్యవతి, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన మిరప మొక్కలు

డోర్నకల్: తుపాన్ ప్రభావంతోపాటు గాలులకు పలు గ్రామాల్లోని మిరప చెట్లు నేలకొరిగి ధ్వంసమయ్యాయి. డోర్నకల్ శివారు లచ్చాతండాకు చెందిన తేజావత్ బాలు రెండెకరాల్లో మిరపతోట చెట్లు నేలవాలాయి. రెండు రోజులుగా చెట్లను కర్రల సహాయంతో నిలబెట్టే ప్రయత్నాలు చేస్తుండగా కొన్ని చెట్లు ప్రధాన కొమ్మలు విరిగిపోగా, కొన్ని చెట్లు ఎండిపోతున్నాయి. రూ.లక్షకు పైగా ఖర్చు చేసి తోట సాగు చేశానని, వారం రోజుల్లో కోత పనులు ప్రారంభించాల్సి ఉండగా వర్షాలతో తీవ్ర నష్టం వాటిల్లిందని బాలు వాపోయాడు.

నష్టపరిహారం చెల్లించాలి

బయ్యారం: తుపాన్ మూలంగా పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు నందగిరి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మండలంలోని పలుగ్రామాల్లో వర్షం మూలంగా దెబ్బతిన్న వరి, మిరప పంటలను ఏఐకేఎంఎస్ ప్రతినిధి బృందం పరిశీలించింది. నష్టపోయిన పంటలపై సర్వే నిర్వహించి రైతులకు పరిహారం అందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు భిక్షం, వెంకన్న, మురళి, హోలీ, నారాయణ, వీరన్న, పుల్యా పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలి

తొర్రూరు: వర్షాకాలం రైతులు పండించిన ధాన్యం కొనుగోళ్లను వెంటనే చేపట్టాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా మహబూబాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి కోరారు. శుక్రవారం తొర్రూరులోని ప్రజాపంథా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తుపాను వర్ష బీభత్సంతో రైతులు కంటిపై కునుకు లేకుండా చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశాడు. కలెక్టర్ జోక్యం చేసుకొని యుద్ధ ప్రాతిపదికన కల్లాలలో ధాన్యం కొనుగోలు ప్రారంభించాలని ఆయన కోరారు. భారీ వర్షాలతో దెబ్బతిన్న మిర్చి, పత్తి మొక్కజొన్న, కూరగాయల పంటలను వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా సర్వే చేయించి నష్టపరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న, నాయకులు షరీఫ్, శ్రీరాం, పుల్లయ్య పాల్గొన్నారు.

గోవుల పంపిణీ

నర్సింహులపేట: మండలంలోని బాసుతండాలో శివ పార్వతి గోశాల ఆధ్వర్యంలో రైతులకు గోవులను పంపిణీ చేశారు. శుక్రవారం తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ చేతుల మీదుగా తండాలోని పేద రైతులకు 10 దూడలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేష్, గోశాల సూపరింటెండెంట్ రోజా, సుధాకర్ నాయక్, వంశీ, రైతులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కకు వినతి

కేసముద్రం: వీఆర్ఏలకు నాలుగు నెలలుగా వేతనాలు రాక, ఎంప్లాయ్ ఐడీలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారంటూ శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో మంత్రి సీతక్కకు, జిల్లా పూర్వ వీఆర్ఏ జేఏసీ చైర్మన్ బిజ్జం భరత్‌కుమార్, సెక్రటరీ శ్రీనివాస్ వినతి పత్రం అందజేశారు.

కులాల వారీగా ఓటరు లిస్ట్ తయారు చేయాలి

నర్సింహులపేట: కులాల వారీగా ఓటరు లిస్ట్ తయారు చేయాలని ఎంపీడీఓ భారతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న ఓటర్ లిస్ట్‌ను తీసుకొని కులాల వారీగా విభజన చేయాలని కార్యదర్శులకు ఆదేశించాడు. కార్యక్రమంలో ఎంపీఓ సోమ్‌లాల్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



మాట్లాడుతున్న కత్తిస్వామి, దస్రూనాయక్

కేసముద్రం: పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతుందని గూడూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి, పీసీసీ సభ్యుడు గుగులోతు దస్రూనాయక్, మైనార్టీ సెల్ స్టేట్ కన్వీనర్ పాష అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజా ఆశీర్వాదంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఇచ్చిన హామీ ప్రకారంగా ఆరు గ్యారంటీలపై సీఎం రేవంత్‌రెడ్డి తొలిసంతకం చేసి మాట నిలబెట్టుకున్నారని అన్నారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సీతక్కకు, ఎమ్మెల్యేగా గెలిచిన మురళీనాయక్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పోలెపాక నాగరాజు, ఇస్లావత్ చందు, మాసాడి శ్రీను, వెంకన్న, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్, సమ్మయ్యగౌడ్, వెంకన్న, నర్సయ్య పాల్గొన్నారు.

ప్రణాళికా బద్ధంగా చదవాలి



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న సంస్థ బాధ్యులు

కురవి: ప్రణాళికా బద్ధంగా అంకితభావంతో చదివితేనే భవిష్యత్ ఉంటుందని ప్రముఖ సామాజికవేత్త సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. శుక్రవారం మండలంలోని నేరడ మోడల్ స్కూల్, సీరోలు మండలం కాంపల్లి జెడ్పీ హైస్కూల్‌లో నేషన్స్ ఫస్ట్ హ్యూమన్ చైన్ ఫౌండేషన్(ఎన్ఎఫ్‌హెచ్‌సీ) ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ సెంట్రల్ స్కాలర్‌షిప్ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్, నోట్ పుస్తకాలు, పెన్నులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంస్థ తరఫున స్కూల్ విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపాడు. 89710 85157, 99893 10141 నంబర్లను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు మోహన్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటకృష్ణ, కాంపల్లి హైస్కూల్ హెచ్ఎం అరుణశ్రీ, వజ్రకుమారి, పిలిఫ్, చైతన్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బాలికల హక్కులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

చిన్నగూడూరు: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో 'బేటీ బచావో, బేటీ పడావో'పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ నలమాస అరుణ మాట్లాడుతూ.. బాలికల హక్కుల గురించి ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. నేడు సమాజంలో మహిళలకు రక్షణ కరువైందని వారి పట్ల లింగ వివక్షత చూపుతున్నారని తెలిపారు. హెల్ప్ లైన్ నంబర్స్ 1098, 100, 181, 1930 గురించి బాలికలకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినులకు శానిటరీ నాప్కిన్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఓ లలిత, సిబ్బంది రాకేష్, సంధ్యారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ముసలమ్మ జాతర



ఆలయం వద్ద భక్తులు

కురవి: సీరోలు మండలం ఉప్పరిగూడెం గ్రామంలో ముసలమ్మ తల్లి జాతర 21వ పర్యాయం శుక్రవారం ఘనంగా అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవోపేతంగా నిర్వహించారు. సర్పంచ్ కాలం తిరుపతిరెడ్డి, జాతర కమిటీ అధ్యక్షుడు కాలం ప్రభాకర్ రెడ్డి, తోటలింగన్నల ఆధ్వర్యంలో ప్రజలు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఊరి జనం బోనాలతో ఊరేగింపుగా ముసలమ్మ తల్లి ఆలయం వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం అమ్మవారికి బోనాల నైవేద్యాన్ని సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

సంక్షిప్త సమాచారం

రోడ్లపై దుకాణాలు పెడితే చర్యలు

డోర్నకల్: రోడ్లపై దుకాణాలు ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్యలు సృష్టించే వారిపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీ హెచ్చరించాడు. స్థానిక 2, 3వ మెయిన్ రోడ్డులో శుక్రవారం మున్సిపల్ సిబ్బందితో కలిసి పర్యటించాడు. రోడ్లపై దుకాణాలు, తోపుడు బండ్లు ఏర్పాటు చేసి ఇబ్బందులకు గురి చేసే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించాడు.

వాటర్ బాటిళ్ల పంపిణీ

గార్ల: మండలంలోని మర్రిగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలోని 30మంది విద్యార్థులకు అదే పాఠశాలలో పనిచేస్తున్న గణితం ఉపాధ్యాయుడు యాదగిరి స్నేహితుడు వాటర్ బాటిళ్లను అందజేశాడు. వాటర్ బాటిళ్లను విద్యార్థులకు అందజేసిన స్నేహితుడికి యాదగిరి కృతజ్ఞతలు తెలిపాడు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కరుణ, సంధ్య, సునీత, తదితరులు పాల్గొన్నారు.

మొక్కుల చెల్లింపు

మహబూబాబాద్ రూరల్: మహారాష్ట్రలోని ధర్మాబాదులో అయ్యప్ప స్వామివారి మహాపడిపూజ, అగ్నిగుండం పూజలకు మహబూబాబాద్ అయ్యప్ప స్వామివారి దేవాలయం ప్రధాన పూజారి బ్రహ్మశ్రీ సంజీవ్ నంబూద్రి గురుస్వామి ఆధ్వర్యంలో స్వాములు శుక్రవారం తరలివెళ్లారు. అక్కడ జరిగిన అగ్నిగుండంలో సుమారు ఐదు వేల మందికి పైగా స్వాములు పాల్గొని నిప్పులపై నడిచి మొక్కులు చెల్లించుకున్నారు.

దుప్పట్ల పంపిణీ

తొర్రూరు: సీఎంగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం పురస్కరించుకొని కాంగ్రెస్ యువ నాయకుడు డాక్టర్ చిరంజీవి దాతృత్వంతో ధర్మశ్రీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం చలితో వణికిపోతున్న పలువురికి దుప్పట్లు పంపిణీ చేశాడు. కార్యక్రమంలో ధర్మ శ్రీ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు ధారావత్ విమల, దళిత రత్న గుండాల నర్సయ్య, శంకర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

నెల్లికుదురు... నెహ్రూసెంటర్: విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో ఉన్న మరమ్మతుల కారణంగా నేడు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ సంగీత శుక్రవారం తెలిపారు. వినియోగదారులకు సహకరించాలని కోరారు.

నివాళి

గంగారం: మండలంలోని మర్రిగూడెం గ్రామంలో శుక్రవారం ఎంసీపీఐ నాయకులు సువర్ణపాక మల్లయ్య వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పుల్లయ్య స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు. కారక్యక్రమంలో ఎంపీపీ సువర్ణపాక సరోజన జగ్గారావు, సువర్ణపాక కాంతరావు, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పెనక పురుషోత్తం, సర్పంచ్ మద్దెల సాంబయ్య, కోఆప్షన్ సభ్యులు సయ్యద్, దనసరి సారయ్య, సువర్ణపాక సమ్మారావు, తనీషా, కాంతారావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

దంతాలపల్లి: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయాలైన సంఘటన గురువారం రాత్రి మండలంలో చోటుచేసుకుంది. ప్రత్యేక సాక్షుల ప్రకారం మరిపెడ మండలం చిలంచర్ల గ్రామానికి చెందిన దూడపాక రాము, అతని తమ్ముడు దూడపాక శ్యామ్ పనిపై తమ గ్రామం నుంచి దంతాలపల్లికి మోటారు బైక్‌పై వస్తున్నారు. మండల కేంద్రంలో గల క్రషర్ మిల్లులో పనిచేస్తున్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన యాతు రామ అనే వ్యక్తి రోడ్డుపై నడుచుకుంటు వెళ్తున్నాడు. ఈక్రమంలో బైక్ అదుపు తప్పి రామను ఢీకొట్టింది. దీంతో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. పోలీసులు చికిత్స నిమిత్తం108 వాహనంలో తొర్రూరు ఆస్పత్రికి తరలించారు.

వైభవంగా హనుమాన్ హోమం



మహబూబాబాద్ రూరల్: పట్టణంలోని హనుమంతునిగడ్డ అంజన్న దేవాలయంలో 25వ రోజైన శుక్రవారం హనుమాన్ హోమం పూజను ఆలయ ప్రధాన అర్చకులు దాసరోజు సందీప్ శాస్త్రి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. హోమంలో పాల్గొన్న భక్తులు ఆహుతులు సమర్పించి అంజన్న తమను అనుగ్రహించాలని వేడుకున్నారు. అర్చకులు భక్తుల గోత్రనామాలపై అర్చన చేసి ఆశీర్వదించారు.

ప్రత్యేక పూజలు

గార్ల: గార్లలోని లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో అయ్యప్పస్వాములు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 40 మంది అయ్యప్ప స్వాములకు జయశంకర్ బిక్ష పెట్టించారు.గురుస్వాములు దుర్గారావు, విజయ రాముడు, కొండల్‌రెడ్డి, మాలాధారులు పాల్గొన్నారు.

వణుకుతున్న ఏజెన్సీ

కొత్తగూడ: తుపాను ప్రభావంతో మూడు రోజులు వర్షాలు కురిసి ఒక్కసారిగా చలి మొదలై ఏజెన్సీ ప్రజలు వణుకుతున్నారు. రాత్రి వేళ ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. ఎక్కువ మంది చలి మంటలవద్దే గడుపుతున్నారు. చలితో శ్వాస కోస సంబంధ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని కొత్తగూడ వైద్యాధికారి శివప్రసాద్ తెలిపాడు. చలి సమయంలో ఉన్ని దుస్తులు ధరించి వెచ్చటి వాతావరణంలో ఉండాలని సూచించాడు. చిన్న పిల్లలను మరింత జాగ్రత్తగా చూసుకోవాలని పేర్కొన్నాడు.

ప్రమాదకరంగా మలుపులు



గార్ల: మండలంలోని పినిరెడ్డిగూడెం గ్రామం నుంచి బాలాజీతండా వయా ఇల్లెందుకు వెళ్లే బీటీ రహదారికి ఇరువైపుల మలుపుల వద్ద ప్రమాదకరంగా ఉన్న ముళ్లపొదలను సంబంధిత అధికారులు వెంటనే తొలగించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని ఈ ప్రాంత ప్రజలు డిమాండ్ చేశారు. ఈ రహదారి గుండా వెళ్లితే దూరం తగ్గుతుందని, వాహనదారులు వెళ్తుంటారు. 2నెలల ఓ వ్యక్తి ట్రాక్టర్ ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ రహదారికి ఇరువైపుల ఉన్న ముళ్లపొదలను తొలగించి రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.